పునర్విభజన.. గందరగోళం

కొత్త డివిజన్లపై అన్ని పార్టీల ఆగ్రహం

డివిజన్లను మార్చాలని

ఎమ్మెల్యే, అధికారులకు వినతి

అభ్యంతరాలకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు

జీహెచ్‌ఎంసీలో డివిజన్ల పునర్విభజన గందరగోళంగా ఉంది. ముఖ్యంగా సరూర్‌నగర్, హయత్‌నగర్‌లలో కొత్తగా అమలు చేసిన డివిజన్లు పూర్తిగా అస్తవ్యస్తంగా ఉన్నాయంటూ స్థానికులు, రాజకీయ నేతలు తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. భౌగోళిక స్వరూపాన్ని, ఓటర్ల సంఖ్యను, పాత డివిజన్ల(వార్డుల) సంఖ్యను పరిగణనలోకి తీసుకుని, క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి డివిజన్లు ఏర్పాటు చేయాల్సిన అధికారులు.. ఏసీ గదుల్లో కూర్చుని ఇష్టానుసారంగా విభజన చేశారని ఆరోపిస్తున్నారు. అంతేగాకుండా స్థానిక కార్పొరేటర్లు, మాజీ ప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలు, గ్రౌండ్ రియాలిటీ పట్టించుకోకుండా తీసుకున్న నిర్ణయం ప్రజలకు అన్యాయం చేస్తుందని మండిపడుతున్నారు. పునర్విభజను పునఃపరిశీలించాలని, అవసరమైతే డ్రాఫ్ట్‌ను మళ్లీ పరిశీలించాలని అన్ని పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇదిలా ఉండగా డివిజన్ ఏర్పాటుపై అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చని, అందుకోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

సరూర్‌నగర్/ హయత్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

సరూర్‌నగర్: గ్రేటర్‌లో విలీనమైన మీర్‌పేట్, బడంగ్‌పేట్ సర్కిళ్లలో డివిజన్ల విభజన అస్తవ్యస్తంగా, గందరగోళంగా తయారయింది. బడంగ్‌పేట్ సర్కిల్‌లో మొన్నటి దాకా 32 వార్డులు ఉండగా, తాజాగా వాటిని మూడు డివిజన్లకు కుదించారు.



బడంగ్‌పేట్‌లో నాలుగు డివిజన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు

అయితే దాదాపు 1.20లక్షల ఓట్లను మూడు డివిజన్లకు సమానంగా కేటాయించకుండా భారీ వ్యత్యాసంతో డివిజన్లు విభజించడం అధికారుల అవగాహనా రాహిత్యానికి అద్దం పడుతోంది. గుడ్డిగా ఉద్యోగ్‌నగర్ కమాన్ నుంచి బడంగ్‌పేట్-నాదర్‌గుల్ రోడ్డులో ఆదిభట్ల హద్దు వరకు తూర్పు వైపు ఉన్న మొత్తం 16 వార్డులను కలిపి నాదర్‌గుల్ పేరుతో ఒకే డివిజన్‌గా ఏర్పాటు చేయడం గమనార్హం! దాంతో ఇక్కడ ఓటర్ల సంఖ్య సుమారు 65వేలకు చేరింది. అదే సమయంలో నాదర్‌గుల్-బడంగ్‌పేట్ రోడ్డుకు పడమర వైపు(ఆర్‌సీఐ రోడ్డుకు తూర్పు వైపు) ఉన్న 9 వార్డులను కలిపి బడంగ్‌పేట్ పేరుతో మరో డివిజన్ ఏర్పాటు చేయగా ఇక్కడ ఓటర్ల సంఖ్య సుమారు 35 వేలుగా ఉండనుంది. ఇక ఆర్‌సీఐ రోడ్డుకు పశ్చిమం వైపు ఉన్న ఐదు వార్డులతో బాలాపూర్ పేరుతో మరో డివిజన్ ఏర్పాటు చేయగా ఇందులో ఓటర్ల సంఖ్య కేవలం 18వేలుగా ఉండడం గమనార్హం! ఒకే సారి డివిజన్లలోని ఓటర్ల సంఖ్యలో భారీ వ్యత్యాసం ఉండడంతో రాజకీయంగానే కాకుండా నిధుల కేటాయింపు, అభివృద్ధిపరంగా కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. దీనిపై అధికారులు దృష్టి సారించి శాస్త్రీయంగా విభజన చేపట్టాల్సిన అవసరం ఉన్నది. బడంగ్‌పేట్ సర్కిల్‌లో డివిజన్ల విభజనపై ఏవైనా అభ్యంతరాలుంటే సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని డిప్యూటీ కమిషనర్ పి.సరస్వతి సూచించారు.

బడంగ్‌పేట్‌లో నాలుగు డివిజన్లు ఏర్పాటు చేయాలి

సుమారు 1.20లక్షల ఓటర్లు ఉన్న బడంగ్‌పేట్‌ను నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. అలా చేస్తే ఒక్కో డివిజన్‌కు సమానంగా 30వేల ఓటర్లు వస్తారని, దీని వల్ల ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంరెడ్డి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

లోపభూయిష్టంగా తుర్కయంజాల్ సర్కిల్ విభజన

హయత్‌నగర్: జీహెచ్‌ఎంసీ డివిజన్‌ల పునర్విభజన ముసాయిదా ప్రాథమిక నోటిఫికేషన్‌లో భాగంగా సుమారు లక్ష ఓట్లు ఉన్న తుర్కయంజాల్ సర్కిల్‌ను రెండు డివిజన్‌లుగా విభజించారు. 53వ డివిజన్‌గా తొర్రూర్, 56వ డివిజన్‌గా తుర్కయంజాల్‌గా విభజించారు. గతంలో 24 వార్డులుగా ఉన్న తుర్కయంజాల్‌ను రెండు డివిజన్‌లుగా ఏర్పాటు చేయడంతో ఆశావాహుల్లో నిరుత్సాహం నెలకొంది. కనీసం మూడు డివిజన్‌లైన ఏర్పాటు చేస్తే బాగుండేదనే అభిప్రాయాన్ని అన్ని పార్టీల నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఏర్పాటు చేసిన రెండు డివిజన్‌లలో మూడు వంతుల భాగాన్ని తొర్రూర్‌కు, ఒక వంతు భాగాన్ని తుర్కయంజాల్‌కు కేటాయిండంపై స్థానిక ప్రజాప్రతినిధులు నిరుత్సాహంగా ఉన్నారు. రాగన్నగూడ, మన్నెగూడ, కమ్మగూడ, ఇంజాపూర్‌లోని 8 వార్డులతో కలిసి కొత్త డివిజన్ ఏర్పాటు చేయాలని ఆశావాహులు కోరుతున్నారు.



తుర్కయంజాల్‌లో రెండు డివిజన్లను విభజిస్తూ మధ్యలో ఉన్న నాగార్జునసాగర్ జాతీయరహదారి

పేర్లను మార్చండి

మీర్‌పేట్ సర్కిల్‌లో కొత్తగా మీర్‌పేట్, జిల్లెలగూడ డివిజన్లు ఏర్పాటు చేశారు. జిల్లెలగూడ డివిజన్‌ను మీర్‌పేట్ డివిజన్‌గా, మీర్‌పేట్ డివిజన్‌ను జిల్లెలగూడ డివిజన్‌గా పేరు మార్చాలి.

- భాస్కర్‌రెడ్డి, జిల్లెలగూడ మాజీ ఎంపీటీసీ

కొహెడా పేరుతో డివిజన్ ఏర్పాటు చేయండి

దాదాపు 10 వేలఓట్లు, 10 వేల ఎకరాల భూములు కలిగి ఉన్న కొహెడాను డివిజన్‌గా ఏర్పాటు చేయాలి. కొహెడా పట్ల చిన్న చూపు చూడడం సరికాదు. తొర్రూర్ డివిజన్‌కు బదులుగా కొహెడా పేరుతో డివిజన్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కొహెడాలో అంతర్జాతీయ వ్యవసాయ మార్కెట్, ఔటర్ రింగు రోడ్డు, సంఘీ పరిశ్రమ, ఫిల్మ్‌సిటి ఉన్న విషయాలను గుర్తించి డివిజన్ ఏర్పాటు చేయాలి

- కొత్త రాంరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు, కొహెడా



ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తాను శాలువాతో సన్మానించిన నిర్వాహకులు

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య ఆరాధన

మన్సూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చతుర్వేద హవన సహిత జ్ఞాన యజ్ఞ మహోత్సవాలలో భాగంగా నాలుగో రోజైన బుధవారం సుబ్రహ్మణ్య ఆరాధన, త్రిశతి హోమాలను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మరక్ష సంస్థ ఆధ్వర్యంలో జనప్రియ ఎన్‌క్లేవ్ కాలనీ సంక్షేమ సంఘం సహకారంతో కాలనీ పార్కు ఆవరణలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యుల ప్రవచనాలు ఆనందింపజేశాయి.

ఖర్చు లెక్క పక్కాగా చూపాలి: ఎంపీడీవో శ్రీవాణి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలిచిన వారు తాము చేసిన ఎన్నికల ఖర్చును నెలరోజుల్లో పక్కాగా చూపాలని ఎంపీడీవో, జిల్లా సహాయ ఎన్నికల అధికారి శ్రీవాణి అభ్యర్థులకు సూచించారు. మూడవ విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గ్రామాల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు అభ్యర్థుల ఎన్నికల ఖర్చు, ఖాతా నిర్వహణపై బుధవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీవాణి మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలను అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, డీఈఈ ఇంద్రాసేనారెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బెల్లి లలిత చిత్ర పటం వద్ద నివాళులర్పించిన యాదవ జేఏసీ నేతలు

బెల్లి లలిత జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

మన్సూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బెల్లి లలిత కీలకంగా వ్యవహరించారని, ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని యాదవ జేఏసీ చైర్మన్ డా.దాసరి అజయ్‌కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద బెల్లి లలిత విగ్రహ ఏర్పాటునకు బుధవారం యాదవ జేఏసీ వైస్ చైర్మన్ చిలుకల శ్రీనివాస్‌యాదవ్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉపేంద్రమ్మయాదవ్‌ల ఆధ్వర్యంలో ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా డా.అజయ్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, సామాజిక తెలంగాణ కోసం బెల్లి లలిత అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అగ్రవర్ణాల రాజకీయ కుట్రల కారణంగా ఆమె హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్లి లలిత హత్యకు కారకులైన వారిని గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని, ఆమె కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు బెల్లి లలిత పేరును పెట్టాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బొమ్మ రఘురాంనేత, కేవీగౌడ్, వేములయ్యగౌడ్, శ్రీనివాస్, పాపన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల విభజనపై అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక కేంద్రాలు

ఎల్‌బీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డివిజన్ల పునర్విభజనపై అభ్యంతరాల స్వీకరణకు జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్, సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయాలలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. డివిజన్ల విభజనపై ఏమైనా అభ్యంతరాలుంటే ఆయా ప్రత్యేక కేంద్రాలలో నిర్దేశిత ఫార్మాట్‌లో లిఖిత పూర్వకంగా తెలియజేయాల్సి ఉంటుంది. బుధవారం ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంతో పాటు హయత్‌నగర్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయాల నోటీసు బోర్డులో విభజన ఉత్తర్వుల కాపీలతో పాటు డివిజన్ల వివరాలను పెట్టారు. ఉపకమిషనర్లు మల్లికార్జునరావు, శ్రీనివాస్, వంశీకృష్ణలు మాట్లాడుతూ, అభ్యంతరాలను ప్రజలు నిర్దేశిత ఫార్మాట్‌లో లిఖిత పూర్వకంగా అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.



సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రం

నూతన డివిజన్‌గా మున్సిపల్ కాలనీ

ఓల్డ్‌మలక్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో ఉన్న మున్సిపల్ (ఎంసీహెచ్) కాలనీని నూతన డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దోబీగల్లి, శంకర్‌నగర్, పద్మానగర్, విజయ్‌నగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, గంజ్, రేస్‌కోర్సు రోడ్డు, సలీంనగర్, అంబేడ్కర్ చౌరస్తా కాలనీలను కలుపుతూ నూతనంగా మున్సిపల్ కాలనీ పేరు మీద కొత్త డివిజన్ ఏర్పాటు చేశారు. కొత్త డివిజన్ ఏర్పాటుపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చింతలకుంట డివిజన్ ఏర్పాటు హర్షణీయం

వనస్థలిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చింతలకుంటను నూతన డివిజన్‌గా ఏర్పాటు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూరెళ్ల వేములయ్యగౌడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం చింతలకుంటలో ఆయన మాట్లాడుతూ, పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్‌ఎంసీలోని 150 డివిజన్లను 300 డివిజన్‌లుగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అందుకు కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చింతలకుంట ప్రాంతం వనస్థలిపురం డివిజన్‌లో ఉందని కాలనీవాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని, ఈ విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు.



తుర్కయంజాల్ సర్కిల్ డీసీ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు

జనాభా ఆధారంగా డివిజన్లను విభజించాలి

● తుర్కయంజాల్ సర్కిల్ డీసీకి బీజేపీ నేతల వినతి

హయత్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనాభా, ఓట్లు, వైశాల్యం, వనరులు ఆధారంగా డివిజన్ విభజన జరగాలని బీజేపీ తుర్కయంజాల్ సర్కిల్ అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. తుర్కయంజాల్ సర్కిల్‌లో డివిజన్‌ల విభజన అస్తవ్యస్తంగా ఉందని, దానిని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు సర్కిల్ డీసీ సత్యనారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ, సాంకేతికత లేకుండా ఇష్టారీతిగా డివిజన్‌లను ఏర్పాటు చేశారని ఆరోపించారు. చారిత్రక నేపథ్యం ఉన్న పెద్ద గ్రామాలను కనీసం పట్టించుకోలేదని అన్నారు. తుర్కయంజాల్ సర్కిల్‌లో మూడు డివిజన్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు రాంరెడ్డి, రమేష్, కార్తీక్, సురేష్, దాసు, సాయి పాల్గొన్నారు.

అశాస్త్రీయంగా డివిజన్ల పునర్విభజన

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఎల్‌బీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో డివిజన్ల పునర్విభజనను కుటుంబ సభ్యుల ఆస్తి పంపకాల మాదిరిగా, అశాస్త్రీయంగా విభజించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం ఆర్‌కేపురం డివిజన్ నాయకులు మీర్‌పేట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సబితా ఇంద్రారెడ్డిని కలిసి డివిజన్ల పునర్విభజనపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మహానగరంలో కోటిన్నర జనాభాతో 150 డివిజన్లుగా ఉన్న జీహెచ్‌ఎంసీని కాంగ్రెస్ ప్రభుత్వం 300 డివిజన్లు చేస్తున్నామని ప్రకటించి అశాస్త్రీయంగా విభజించారన్నారు. భవిష్యత్తును ఆలోచించకుండా అడ్డగోలుగా డివిజన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లను ప్రజల సౌలభ్యం కోసం సత్వర సేవలందించేందుకు 78 డివిజన్లతో కార్పొరేషన్లను చేసి పాలకవర్గంతో ప్రజల ముంగిటకే పురపాలన తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత చర్యల మూలంగా కేవలం ఆరు డివిజన్లు మాత్రమే ఏర్పాటు చేశారని, దీంతో రాజకీయ శూన్యతతో పాటు ప్రజలకు సత్వర సేవలు అందకుండా పోతాయని ఆమె అన్నారు. సర్కిళ్లు ఏర్పాటు చేసి జోన్లలో విలీనం చేయడం కూడా అడ్డగోలుగా చేశారని ఆరోపించారు. తక్షణమే జరిగిన తప్పులను సరిచేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ సునీతారెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు నాగేష్, ఉద్యమకారుల నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, రామాచారి, శ్రీనివాస్, సాజిద్, శేఖర్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

పార్టీలకతీతంగా బడంగ్‌పేట్‌ను రక్షించుకుందాం

● బీజేపీ రాష్ట్ర నేత అందెల శ్రీరాములు

సరూర్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా కలిసికట్టుగా పోరాటం చేసి బడంగ్‌పేట్‌ను చార్మినార్ జోన్ నుంచి రక్షించుకుందామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ పిలుపునిచ్చారు. నాదర్‌గుల్ 9వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ నిమ్మల సునీతాశ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో కాలనీల ప్రతినిధుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న అందెల మాట్లాడుతూ, బడంగ్‌పేట్‌ను చార్మినార్ జోన్‌లో కలపడం అసంబద్ధ నిర్ణయమని, వెంటనే సదరు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బడంగ్‌పేట్‌ను ప్రత్యేక జోన్‌గా ఏర్పాటు చేయాలన్నారు. పార్టీలకతీతంగా అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు దీనిపై తమ నిరసనను వ్యక్తం చేయాలని, తమ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ బడంగ్‌పేట్ క్లస్టర్-2 అధ్యక్షుడు రామిడి వీరకర్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, భాగ్యనగర్ రైతు సంఘం డైరెక్టర్లు పుల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బీజేపీ నాయకులు అంజిరెడ్డి, రవికాంత్‌గౌడ్, నర్సింగ్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

జర్మనీలో ఉద్యోగాలిప్పిస్తానంటూ మోసం

● వీసా విజన్ కన్సల్టెన్సీ డైరెక్టర్‌పై కేసు నమోదు

చాదర్‌ఘాట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో ఉద్యోగాలిప్పిస్తానంటూ విద్యార్థుల నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేసిని మోసగించిన వీసా విజన్ కన్సల్టెన్సీ డైరెక్టర్‌పై మలక్‌పేటలో పీఎస్‌లో బుధవారం కేసు నమోదైంది. మలక్‌పేట ఎస్‌ఐ సంజీవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జర్మనీలో ఉద్యోగాలిప్పిస్తానంటూ ముసారాంబాగ్‌లోని వీసా విజన్ కన్సల్టెన్సీ ప్రకటనలు వేశారు. వీటిని నమ్మిన నిరుద్యోగులైన విద్యార్థులు రూ.3.50లక్షల ఫీజుకుగాను రూ.2లక్షల వరకు చెల్లించారు. జర్మనీ భాష నేర్చుకుని వీసా వచ్చిన తర్వాత మిగతా డబ్బులు చెల్లిస్తామని విద్యార్థులు తెలిపారు. జర్మనీ నుంచి వీసా రాకపోగా నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో విసుగెత్తిన పలువురు విద్యార్థులు వీసా విజన్ డైరెక్టర్ రఘువీరారెడ్డిని నిలదీశారు. దాదాపు 50 మందికి పైగా విద్యార్థుల నుంచి కోటి రూపాయలకు పైగా వసూలు చేసినట్లు సమాచారం. కన్సల్టెన్సీ నిర్వాహకుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో 14 మంది విద్యార్థులు మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లక్షల్లో డబ్బులు కట్టినా తమకు వీసా ఇప్పించి జర్మనీకి పంపకుండా మోసం చేస్తున్న డైరెక్టర్ రఘువీరారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అత్య, పత్య క్రీడా పోటీలకు పెద్దఅంబర్‌పేట్‌లోని రాజశ్రీ విద్యా మందిర్‌లో 9వ తరగతి చదువుతున్న దేవిరామ్, తమన్వీ ఎంపికయ్యారని కోచ్ నీలేష్ తెలిపారు. గత నెల నవంబర్ 29న సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు పంజాబ్‌లోని విశ్వవిద్యాలయంలో జరుగనున్న జాతీయ స్థాయి క్రీడ పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ చెప్పారు. బుధవారం స్కూల్ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అత్య పత్య సంఘం అధ్యక్షుడు పోచారం సంజీవరెడ్డిలు విద్యార్థులను అభినందించారు.

స్టూడెంట్స్ వీసా పేరుతో మోసం

ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పంజాగుట్ట, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్స్ వీసా పేరుతో డబ్బులు వసూలు చేసిన ఘటనలో ఇద్దరిని పోలీసులు కటకటాల వెనక్కి పంపారు. పాతబస్తీ మొఘల్ పురాకు చెందిన సయ్యద్ షానవాజ్. స్టూడెంట్ వీసా కోసం అమీర్‌పేట్‌లో ఉన్న ఓ క్యాన్సల్టెన్సీని సంప్రదించాడు. నిర్వాహకులు నస్రీన్ బేగం, సయ్యద్ సోహెల్‌లు వీసా ప్రాసెసింగ్ కోసం అతడి నుంచి 7.50 లక్షల రూపాయలు తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా వీసా రాకపోవడంతో బాధితుడు పలుమార్లు వారిని సంప్రదించినా ఫలితం లేకపోయింది. విసిగిపోయిన అతను కొద్ది రోజుల క్రితం పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

సంక్షేమంపై శ్రద్ధ చూపాలి

సీఎంకు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నేతల వినతి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓయూ విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నేతలు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఓయూ పర్యటనలో భాగంగా ఆర్ట్స్ కాలేజీకి వచ్చిన సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్, ఓయూ అధ్యక్షురాలు స్వాతి మాట్లాడుతూ.. ఓయూ అభివృద్ధికి ప్రకటించిన రూ.వేయి కోట్ల నిధులు, టీచింగ్ పోస్టుల భర్తీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

ఓయూకి రూ.వెయ్యి కోట్లు హర్షణీయం : ఓయూ జేఏసీ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓయూకి రూ.1000 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ నిర్ణయమని ఓయూ జేఏసీ అధ్యక్షుడు బైరు నాగరాజు గౌడ్ అన్నారు. వందేళ్ల ఓయూలో పేరుకుపోయిన సమస్యల సుడిగుండాలను సీఎం రేవంత్ రెడ్డి తొలగించారన్నారు. నిధుల కొరతతో కుంగిపోయిన ఓయూకి ఇప్పుడు "సిరిసంపదలు" కురిపించారని, 75 ఏళ్లుగా ఎవరూ పొందని గౌరవం ఆయనకు దక్కిందన్నారు. ఓయూ అభివృద్ధికి కొత్త దిశ, దశ మొదలైందని, పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేశారని వ్యాఖ్యానించారు.

58 డివిజన్‌లుగా..

శివారు విలీన మున్సిపాలిటీలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తగా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పరిధిలో నూతన డివిజన్ల విభజన ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ డివిజన్ల పునర్విభజన నోటిఫికేషన్‌ను జారీ చేశారు. మొత్తం 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్‌ల పరిధిలో ప్రాంతాలను 58 మునిసిపల్ డివిజన్‌లుగా నిర్ణయిస్తూ నోటిఫికేషన్ జారీచేశారు. ఆయా డివిజన్లకు సరిహద్దులను నిర్ణయించి పునర్విభజన ప్రక్రియను జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టారు. దీనిపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించనున్నారు.

కార్పొరేషన్‌లు..7	డివిజన్లు.. 19	గతంలో వార్డులు 229
1 బండ్లగూడ జాగీర్	కిస్మత్‌పూర్, బండ్లగూడ జాగీర్, హైదర్‌షా కోట్	22
2 బడంగ్‌పేట్	నాదర్‌గుల్, బడంగ్‌పేట, బాలాపూర్	46
3 ఫిర్జాదిగూడ	మేడిపల్లి, ఫిర్జాదిగూడ	26
4 బోడుప్పల్	బోడుప్పల్, చెంగిచర్ల	28
5 జవహర్‌నగర్	జవహర్‌నగర్, చంద్రపురి కాలనీ	28
6 నిజాంపేట	ప్రగతినగర్, బండారి లేఅవుట్, బాచుపల్లి, నిజాంపేట	33
7 మీర్‌పేట	మీర్‌పేట, జిల్లెలగూడ, ప్రశాంతి హిల్స్	46
మునిసిపాలిటీలు(20),	మొత్తం డివిజన్లు(39)	
1 జల్‌పల్లి	జల్‌పల్లి, షాహీన్‌నగర్, పహడీషరీఫ్	28
2 శంషాబాద్	శంషాబాద్, కొత్వాల్‌గూడ	25
3 తుక్కుగూడ	తుక్కుగూడ, ఇమామ్‌గూడ	15
4 ఆదిభట్ల	ఆదిభట్ల, కొంగర కలాన్	15
5 తుర్కయాంజాల్	తొర్రూరు, తుర్కయంజాల్	24
6 పెద్ద అంబర్‌పేట	పెద్ద అంబర్‌పేట, కుంట్లూరు	24
7 దమ్మాయిగూడ	దమ్మాయిగూడ, కీసర	18
8 నాగారం	నాగారం, చక్రిపురం	20
9 తూంకుంట	తూంకుంట	14
10 మేడ్చల్	మేడ్చల్, కిష్టాపూర్	23
11 ఘట్‌కేసర్	ఘట్‌కేసర్, ఏదులాబాద్	18
12 గుండ్లపోచంపల్లి	గుండ్లపోచంపల్లి	15
13 దుండిగల్	దుండిగల్, బౌరంపేట, బహదూర్‌పల్లి	27
14 కొంపల్లి	కొంపల్లి, దూలపల్లి	18
15 అమీన్‌పూర్	అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్	24
16 తెల్లాపూర్	తెల్లాపూర్, ముత్తంగి	09
17 ఐడీఏ బొల్లారం	బొల్లారం	12
18 నార్సింగ్	నార్సింగ్, కోకాపేట, గండిపేట	18
19 మణికొండ	మణికొండ, నెక్నంపూర్	20
20 పోచారం	పోచారం	18

రోలర్ స్కేటింగ్‌లో బాలికల సత్తా

మన్సూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఏపీలోని విశాఖపట్నం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల విభాగం నుంచి తొమ్మిది మందితో కూడిన టీంలో మన్సూరాబాద్‌కు చెందిన సరాబు తన్వి, రిషికారెడ్డిలు పాల్గొన్నారు. గోల్ కీపర్‌గా తన్వి వ్యవహరించింది. ప్రత్యర్థి టీంలతో తలపడి కాంస్య పతకాన్ని కైవసం చేసుకోవడంలో వీరిద్దరు కీలకంగా వ్యవహరించారు. తన్వి, రిషికారెడ్డిలకు మన్సూరాబాద్ వాసులు అభినందనలు తెలియజేశారు.

పాముకాటుతో కూలీ మృతి



నారాయణ

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో కూలీ మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రానికి చెందిన నారాయణ (50) పది రోజుల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామంలోని జగత్ స్వప్న వెంచర్‌లో కూలీగా పనిలో చేరాడు. మరి కొందరు కూలీలతో కలిసి వెంచర్‌లోని షెడ్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా మంగళవారం రాత్రి 11.30గంటల సమయంలో మూత్ర విసర్జన కోసం నారాయణ పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలోకి వెళ్లాడు. అదే సమయంలో పాము అతని కుడి మోకాలిపై రెండు కాట్లు వేసింది. వెంటనే ఈ విషయాన్ని మరో కూలి అయిన జుడిష్టర్‌నాయక్‌కు తెలిపాడు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నారాయణ మృతి చెందాడు. నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.